# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**విజయవాడ,**
**తేది: 27 ఫిబ్రవరి, 2021.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

ఈ రోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు గౌరవ ముఖ్యమంత్రి గారికి పంపిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాము. – **జె.ప్రభాకర్**

**ఆర్యా,**

**విషయం : రాష్ట్ర సిలబస్ స్థానంలో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టడంపై .... విద్యా రంగ నిపుణులు, ప్రతినిధులతో చర్చించిన తరువాతే నిర్ణయం తీసుకోవాలని కోరుతూ...**

మన రాష్ట్రంలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు అందరికీ వచ్చే విద్యాసంవత్సరం నుండి సిబిఎస్ఇ సిలబస్‌ను అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పత్రికాముఖంగా తెలుసుకున్నాము. అంటే మన రాష్ట్రంలో తెలుగు సంస్కృతికి, మన ప్రత్యేక భౌగోళిక, సామాజిక పరిస్థితులకు, విశిష్టతలకు అనుగుణంగా రూపొందించుకుని ఇన్నేళ్ళుగా అమలు జరుపుతున్న మన రాష్ట్ర సిలబస్ ఇకముందు ఉండదు. ఇంత కీలకమైన నిర్ణయాన్ని తీసుకునేముందు ప్రభుత్వం విద్యారంగ నిపుణులతో, రాష్ట్రంలోని అనుభవజ్ఞులైన విద్యావేత్తలతో, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో చర్చలు జరిపి వుండాల్సింది. మానవవనరుల అభివృద్ధి ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో చేపట్టవలసిన బాధ్యత. విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ అవసరం. ప్రభుత్వం ఆ విధమైన వైఖరితో లేకపోవడం శోచనీయం.

భిన్న జాతులతో, భిన్న సంస్కృతులతో, బహు భాషలతో, ఎంతో వైవిధ్యంతో కూడిన దేశం మనది. అందుకనే స్వతంత్ర భారతదేశం రాష్ట్రాల సమాఖ్యగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. ఈ సమాఖ్య స్ఫూర్తిని బలంగా నిలుపుకున్నప్పుడే భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించగలం. అందుకే విద్యను రాజ్యాంగనిర్మాతలు ఉమ్మడిజాబితాలో పొందుపరిచారు. మన రాష్ట్ర ప్రత్యేకతలకు అనుగుణంగా బోధన జరిగినప్పుడు మాత్రమే మన విద్యార్థుల మనోవికాసం, విషయగ్రాహ్యత పూర్తిస్థాయిలో సాధ్యపడతాయి. వారిలో సృజనాత్మకత పూర్తి స్థాయిలో వెల్లివిరుస్తుంది.

ఈ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా గత ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన విద్యా విధానం ఉంది. ఇది రాష్ట్రాల హక్కుపై కేంద్రం తలపెట్టిన ఇంకొక దాడి. మన రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి, దానిని ఏకపక్షంగా అమలు జరపదలచుకున్న కేంద్రం తీరుకు అభ్యంతరం తెలిపి వుండాల్సింది. కాని మీరు దానిని బేషరతుగా స్వాగతించారు. మన తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలను, మన తెలుగు రాష్ట్రాల ప్రత్యేకతలను ఏమాత్రమూ పరిగణించని కేంద్ర సిలబస్‌ను ఇప్పుడు అమలు చేయబూనుకుంటున్నారు. ఇది నష్టదాయకం.

ఎవరైనా సిబిఎస్ఇ సిలబస్ ప్రకారం చదువుకోదలిస్తే అందుకు మన రాష్ట్రంలో ఇప్పుడు తగిన ఏర్పాట్లు ఉన్నాయి. సిబిఎస్ఇ సిలబస్‌లో మేలైన అంశాలుంటే వాటిని రాష్ట్ర సిలబస్‌లో ఎప్పుడైనా పొందుపరచవచ్చు. అలా కాకుండా ఏకంగా సిబిఎస్ఇ సిలబస్‌ను మాత్రమే అమలు చేయడం సరైనది కాదు. ఇకమీదట ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన ఒక విద్యా ప్రణాళిక అవసరమే లేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నదా?

గతంలో మొత్తం ఇంగ్లీషు మీడియంలోకి విద్యాబోధనను మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే అవాంఛనీయమని పలువురు అభ్యంతరాలు తెలిపారు. ఆ వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు ఇంకా వెలువడాల్సివుంది. ఇప్పుడు దానికి తోడు సిబిఎస్‌ఇ సిలబస్‌ను అమలు చేయబూనుకుంటే రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం కకావికలు కావడం తథ్యం. పేద, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల విద్యార్థులు అందరికన్నా ఎక్కువ నష్టపోతారు. ఇతర వర్గాల విద్యార్థులు కూడా తెలుగుతనం కోల్పోతారు.

దేశంలోనేగాక, ప్రపంచమంతటా ఎక్కడ మేలైన విద్యా పద్ధతులు ఉన్నా వాటిని స్వీకరించవచ్చు. కాని మన అస్తిత్వాన్ని, సంస్కృతిని, వారసత్వాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి మోడీ ప్రభుత్వ కాషాయీకరణ ఎజెండాతో కొట్టుకుపోతే అది మన రాష్ట్రానికి ఏమాత్రమూ మంచిది కాదు. రాజకీయంగా ఈ ప్రభుత్వానికీ మంచిది కాదు.

తెలుగునేల చరిత్ర, వారసత్వం, సంస్కృతి ప్రాతిపదికగా మన పిల్లలను చదువుకోనివ్వండి. మోడీ సర్కారు తలపెట్టిన విద్యారంగ కాషాయీకరణను, అశాస్త్రీయ విద్యా విధానాలను నిలువరించండి. రేపటి తరాలు దిశానిర్దేశం లేకుండా మూఢత్వంలో మునిగిపోయి సృజనాత్మకతను కోల్పోయే దుస్థితిని రానివ్వకండి.

కనుక మీరు సిబిఎస్‌ఇ సిలబస్‌ను అమలుచేయాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరుతున్నాము. విద్యారంగ నిపుణులతో, ప్రతినిధులతో సమగ్రంగా చర్చించిన తర్వాతే ఏ నిర్ణయమైనా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

విప్లవాభివందనములతో...

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి